వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 347
పేజీలు : 08 | వెల: రూ.5/-

శనివారం
నవంబర్ 08, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## పద్మశాలి వన భోజనాలకు సర్వం సిద్ధం

- ముమ్మరంగా ఏర్పాట్లు
- తరలిరానున్న కులబాంధవులు



2లో..

## సూది ఉంటే.. దూది లేదు

- ఎంజీఎంలో సమస్యల తిష్ట
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



8లో..

## అర్హులకు ప్రభుత్వ పథకాలు

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- అధికారులకు దిశా నిర్దేశం

- చినుకు పడితే మునుగుడే
- సర్వం కోల్పోతున్న రెండు వేల కుటుంబాలు
- ముంపునకు పరిష్కారం చూపని పాలకులు
- పదేళ్లుగా ఇదే తంతు
- వస్తున్నాం.. చూస్తున్నాం.. పోతున్నాం అన్నట్లుగా నేతల పర్యటనలు
- సాయం కాదు సమస్య తీర్చాలంటూ జనం తిరుగుబాటు
- సమీక్షలతోనే సరిపెడుతున్న బల్దియా పాలకవర్గం



వివరాలు2లో..

# భరోసా లేని.. బతుకులు

వరంగల్ మహా నగరాన్ని వరదలు వదలడంలేదు. చినుకు పడితే పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. హంటర్ రోడ్డులోని బొంది వాగు ఉప్పొంగడంతో పదికిపైగా కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. ఇళ్లలోకి వరద నీరు పోటెత్తడంతో రెండు వేలకు పైగా నిరుపేదలు సర్వం కోల్పోతున్నారు. రెండు వేలకు పైగా కుటుంబాలకు చెందిన తిండి గింజలు మొదలుకొని నిత్యావసరాలు, గృహోపకరణాలు వర్షార్పణం కావడంతో లబోదిబోమంటున్నారు. వీరి జీవితాలు భరోసా లేని బతుకులుగా మారుతున్నాయి. పదేళ్లుగా ఇదే తంతు జరుగుతున్నా పరిష్కరించేవారే కరువయ్యారు. ముంపు సమస్యకు పరిష్కారం చూపించాల్సిన బల్దియా పాలకులు, అధికారులు నిద్రమత్తును వీడడంలేదు. వరదలు వచ్చిన ప్రతి సారీ రాష్ట్రంలోని ముఖ్య నేతలు పర్యటనలతో హోరెత్తించడం తప్ప సమస్యకు పరిష్కారం చూపడంలేదన్న ఆరోపణలున్నాయి. వస్తున్నాం.. చూస్తున్నాం.. పోతున్నాం అన్నట్లుగానే వీరి పర్యటనలు సాగడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని కాకుండా తమ సమస్యను పరిష్కరించుకునేందుకు ఉద్యమమే లక్ష్యంగా ఎన్నుకున్నారు. ఇటీవల పెద్ద ఎత్తున రాస్తారోకో చేసిన ముంపు బాధితులు ఇది అంతం కాదు ఆరంభమే అంటూ ప్రకటించారు. దశలవారీగా ఉద్యమాలు చేస్తామన్నారు. అయితే ఎప్పటిలాగే మేయర్ గుండు సుధారాణి నగర కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తోపాటు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి చేతులు దులుపుకున్నారు. యథా రాజా.. తథా ప్రజ అన్నట్లుగానే సమస్యను అటకెక్కించారు.

– వరంగల్ వాయిస్ ప్రతినిధి










WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శనివారం, నవంబర్ 08, 2025

# భరోసా లేని.. బతుకులు



- చినుకు పడితే మునుగుడే
- సర్వం కోల్పోతున్న రెండు వేల కుటుంబాలు
- ముంపునకు పరిష్కారం చూపని పాలకులు
- పదేళ్లుగా ఇదే తంతు
- వస్తున్నాం.. చూస్తున్నాం.. పోతున్నాం అన్నట్లుగా నేతల పర్యటనలు
- సాయం కాదు సమస్య తీర్చాలంటూ జనం తిరుగుబాటు
- సమీక్షలతోనే సరిపెడుతున్న బల్దియా పాలకవర్గం

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** గత 12 సంవత్సరాలుగా హంటర్ రోడ్డులోని రామన్నపేట, సంతోషిమాత కాలనీ, సాయినగర్ కాలనీ, బృందావన్ కాలనీ, ఎన్టీఆర్ నగర్ కాలనీ, భద్రకాళి కాలనీ, గాయత్రి కాలనీ, కాకతీయ కాలనీ, అభయ ఆంజనేయ కాలనీలతో పాటు డీకే నగర్, ఇందిరమ్మ కానీ, శిరంగిరాజారాం తోట, పెరుకవాడ, శివనగర్ ప్రాంతాలు ముంపుకు గురవుతూ తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈ కాలనీవాసులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సి వస్తోంది.

## సర్వం వర్షార్పణం.

చినుకు పడిందంటే చాలు ముంపు ప్రాంత వాసులు బిక్కుమంటూ కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి ఏడు ఇళ్లలోకి వరద నీరు పోటెత్తడంతో రెండు వేలకు పైగా నిరుపేద కుటుంబాలు సర్వం కోల్పోతున్నారు. రెండు వేలకు పైగా కుటుంబాలకు చెందిన తిండి గింజలు మొదలుకొని నిత్యావసరాలు, గృహోపకరణాలు వర్షార్పణం కావడంతో లబోదిబోమంటున్నారు. తినడానికి తిండిలేని పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. వరదలు వచ్చాయంటే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న బల్దియా పాలకులు, అధికారులు ముంపునకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మాత్రం ముందుకు రావడంలేదు.

## బొందివాగే ప్రధాన కారణం..

హంటర్ రోడ్డు ముంపునకు ప్రధాన కారణం బొందివాగే అన్నది జగమెరిగిన సత్యం. సుందరీకరణలో భాగంగా భద్రకాళి రిజర్వాయర్ చుట్టూ నిర్మించిన బండ్ తో ఎక్కడి నీరు అక్కడే నిలిచి చుట్టు పక్కల ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. అయితే బొందివాగు నుంచి ప్రవహించు వర్షపు నీరు నేరుగా భద్రకాళి రిజర్వాయర్ లోనికి వెళ్లేలా తగు ఏర్పాట్లు చేస్తే సమస్యను చాలా వరకు పరిష్కరించవచ్చు. వెంటనే బొందివాగు నాళాను విస్తరించి రెండు వైపుల రివిట్ మెంట్ వాలు నిర్మించాల్సిన ఆవశ్యకత ఉన్నా పాలకులు పెద్దగా పట్టించుకోవడంలేదు. అదే విధంగా బొందివాగుకు పైనున్న చెరువుల మత్తడి నీరు బొంది వాగులోనికి ప్రవహించడం అట్టి ప్రవాహం భద్రకాళి లోనికి వెళ్లకపోవడంతో ఈ ప్రాంతం నీటిలో మునిగిపోతోంది. అదే విధంగా 12 మోరీల ద్వారా వచ్చే నీటి ప్రవాహం నేరుగా మలుగు రోడ్డు నాళాకు అనుసందానం చేయాల్సిన అవరసం ఎంతైనా ఉంది.

## వస్తున్నాం.. చూస్తున్నాం..

వరదలు ముంచెత్తిన ప్రతి సారీ స్థానిక ప్రజా ప్రతినిధులతో రాష్ట్ర మంత్రులు, ముఖ్య మంత్రులు ముంపు ప్రాంతాల్లో పర్యటించడం పరిపాటిగా మారింది. వచ్చిన ప్రతి ఒక్కరు ముంపునకు శాశ్వత పరిష్కారం చూపిస్తామంటూ ప్రకటనలు చేయడం తప్ప పెద్దగా ఒరిగిందేమీ లేదు. బీఆర్ఎస్ పాలనలో అప్పటి యువరాజు ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని, నాళాల ఆక్రమణలో ఎవరినీ ఉపేక్షించరాదంటూ చెప్పినప్పటికీ స్థానిక నేతలు పెద్దగా పట్టించుకున్నది లేదు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైతం ముంపు ప్రాంతాల్లో పర్యటించి శాశ్వత పరిష్కారం చూపాలంటూ ఆదేశించారు. అందుకు పటిష్ట సమగ్ర ప్రణాళికలు రూపొందించాలంటూ ఆదేశించారు.

## సాయం కాదు సమస్య తీర్చాలి..

ముంపునకు గురైన కుటుంబాలను ఆదుకుంటామంటూ అధికారులు ఇంటింటికి తిరగడాన్ని ముంపు బాధితులు తప్పుబడుతున్నారు. సాయం కాదు సమస్యకు పరిష్కారం చూపాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు పలు మార్లు అధికారులకు మొర పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోక పోవడంతో ప్రత్యక్ష పోరుకు సిద్ధపడుతున్నారు. ఇటీవల హంటర్ రోడ్డులోని 12 మోరీల ప్రాంతంలో పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకో నిర్వహించి తమ గళం వినిపించారు. ఇది అంతం కాదు ఆరంభం అంటూ హెచ్చరించారు. ముంపు సమస్య పరిష్కరించే వరకు ఉద్యమిస్తామంటూ హెచ్చరించారు. బల్దియా పాలకులపై దుమ్మెత్తి పోశారు. మేయర్ గుండు సుధారాణి డివిజన్ లోని అనేక ప్రాంతాలు ముంపునకు గురికావడంపై మండిపడుతున్నారు. మేయర్ ఇలాఖాలోనే పరిస్థితి ఇలా ఉంటే ఎట్లా అంటూ నిలదీస్తున్నారు. అమె పనితనానికి ముంపు ప్రాంతాలు మచ్చుతునక అంటూ చురకలు అంటిస్తున్నారు.

### నత్తనడకన పనులు..

**- వలబోజు శ్రీనాథ్, రామన్నపేట**



హంటర్ రోడ్డులోని 12 మోరీల పనులు నత్తనడకన సాగుతున్నాయి. వర్షం వచ్చిందంటూ ఈ ప్రాంతం మొత్తం నీటితో నిండిపోతోంది. సమస్యను పరిష్కరించాలని పలు మార్లు అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఆగుతూ.. సాగుతున్న పనులతో రామన్న పేట ముంపుకు గురి కావాల్సి వస్తోంది.

### చెరువులోకి పంపాలి..

**- తాళ్లపెల్లి రమేష్, రామన్నపేట**



బొందివాగు నుంచి ప్రవహించు వర్షపు నీరు నేరుగా భద్రకాళి రిజర్వాయర్ లోనికి వెళ్లేలా తగు ఏర్పాట్లు చేయాలి. బండ్ నిర్మాణం లేనప్పుడు ముంపు సమస్యేలేదు. వెంటనే బొందివాగు నాళాను విస్తరించి రెండు వైపుల రివిట్ మెంట్ గోడలు నిర్మించాల్సిన ఆవశ్యకత ఉన్నా పాలకులు పెద్దగా పట్టించుకోవడంలేదు.

### ఆక్రమణలు తొలగించాలి..

**- కన్నోజు జలెందర్, రామన్నపేట**



నాళాల ఆక్రమణలను వెంటనే తొలగించాలి. గతంలో కేటీఆర్, ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి పర్యటించి ముంపునకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఆదేశించారు. ఆక్రమణ దారులు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దంటూ సూచించారు. వారి ఆదేశాలను అమలు చేసి నాళాల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంతోపాటు వాటిని తొలగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.








# సూది ఉంటే.. దూది లేదు

- ఎంజీఎంలో సమస్యల తిష్ట
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**వరంగల్ వాయిస్, ఎంజీఎం :** ఒకప్పుడు ఉత్తర తెలంగాణకే తలమానికంగా నిలిచిన ఎంజీఎం ఆసుపత్రిలో నేడు సూది ఉంటే దూది లేని పరిస్థితి నెలకొందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనం బాటలో భాగంగా శనివారం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిని కల్వకుంట్ల కవిత సందర్శించారు. ఎంజీఎంలో తిష్ట వేసిన పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ పాలకులు అంధకారంలోకి ప్రజలను నెట్టేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎంజీఎం ఆస్పత్రిలో గత మూడు సంవత్సరాలుగా కొత్త పరికరాలు కొనుగోలు చేయలేని దుస్థితి నెలకొందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇద్దరు మహిళా మంత్రులున్నప్పటికీ మహిళా ప్రస్తుతి ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు లేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఎంజీఎంలో ఇదే పరిస్థితి ఏర్పడుతోందని విమర్శించారు. పర్యటించిన జిల్లాల్లో టేక్ యాక్షన్ రిపోర్టుతో కార్యచరణ చేయనున్నట్లు కవిత ప్రకటించారు.

# బాలోత్సవ్‌లో మెరిసిన యువ నృత్యకారిణి




## బేబీ రిత్వికకు అభినందన వెల్లువ

**వరంగల్ వాయిస్, గుంటూరు :** గుంటూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటీలో ఇటీవల నిర్వహించిన బాలోత్సవ్–2025 కూచిపూడి నృత్యం సబ్–జూనియర్స్ విభాగంలో యువ నృత్యకారిణి బేబీ రిత్విక ఖమ్మంపాటి సత్తా చాటారు. నగరంలోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని బేబీ రిత్విక తృతీయ బహుమతిని సాధించి సంస్థకు గర్వకారణంగా నిలిచారు. వరంగల్‌లోని సద్గురు శ్రీ శివానంద నృత్యమాల నుంచి భోమేపల్లి సుధీర్ రావు నిపుణుల మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన రిత్విక, తెలుగు శాస్త్రీయ నృత్యం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ తన సమర్థత, అంకితభావంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. స్కూల్ యాజమాన్యం, అధ్యాపకులు రిత్వికను హృదయపూర్వకంగా అభినందించారు. ఆమె విజయం బిర్లా ఓపెన్ మైండ్స్‌లో పెంపొందించే వాతావరణాన్ని, యువ ప్రతిభలోని అభిరుచి శక్తిని ప్రతిబింభిస్తుంది అని పాఠశాల ప్రతినిధి ఒకరు తెలిపారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శనివారం, నవంబర్ 08, 2025

# అవిశ్రాంత లక్ష్యసాధకుడు సీఎం రేవంత్ రెడ్డి



**వరంగల్ వాయిస్, దామెర :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి దురిశెట్టి భిక్షపతి ముఖ్యమంత్రిని అభినందిస్తూ ప్రసంగించారు. ఎలాంటి అడ్డంకులు ఎదురైనా, ఒక జడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన అవిశ్రాంత లక్ష్యసాధకుడు శ్రీ రేవంత్ రెడ్డి అని ఆయన కొనియాడారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతిపక్షాల కుట్రలను, అంచనాలను తలకిందులు చేస్తూ, సీనియర్ మంత్రులతో సమన్వయం చేసుకుంటూ రెండు సంవత్సరాలుగా స్వేచ్ఛాయుత పాలన కొనసాగిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఏకకాలంలో రూ. 22 వేల కోట్ల రుణమాఫీని అమలు చేశారని గుర్తుచేశారు. 'వరి వేస్తే ఉరే' అన్న గత ప్రభుత్వ విధానాలకు స్వస్తి చెప్పి, వరి పండించిన రైతులకు రూ. 500 బోనస్‌తో సహా చెల్లించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. క్రమక్రమంగా ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ, ఒక పక్క అభివృద్ధి, మరో పక్క సంక్షేమానికి పాటుపడుతున్న శ్రీ రేవంత్ రెడ్డి గారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, ఈ రాష్ట్రానికి మరో 10 సంవత్సరాలు సేవలందించాలని ప్రజలు ఆశీర్వదించాలని భిక్షపతి కోరారు. ఈ కార్యక్రమంలో సదరం లింగయ్య, దామెర రతన్, దామెర సతీష్, అర్తం విక్రమ్, సదరం వంశీ, నిఖిల్, రాజకుమురు, కనకయ్య, వినోద్, సతీష్, కాంగ్రెస్ మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

# శాయంపేటలో సీఎం జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, శాయంపేట:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని, శాయంపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, ప్రజలకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని 'అవిశ్రాంత లక్ష్యసాధకుడు'గా అభివర్ణించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఒక జడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా, సీనియర్ సహచర మంత్రులకు స్వేచ్ఛనిస్తూ, సమన్వయం చేసుకుంటూ రెండు సంవత్సరాలుగా పాలన కొనసాగిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నప్పటికీ, రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఏకకాలంలో రూ. 22 వేల కోట్ల రుణమాఫీని చేసి చూపించారు. 'వరి వేస్తే ఉరే' అన్న గత ప్రభుత్వ విధానాలకు భిన్నంగా, వరి పండించిన రైతులకు రూ. 500 బోనస్‌తో సహా చెల్లించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కింది. క్రమక్రమంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ఒక పక్క అభివృద్ధి, మరో పక్క సంక్షేమానికి పాటుపడుతున్న రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉంటూ, ఈ రాష్ట్రానికి మరో 10 సంవత్సరాలు సేవలందించాలని ప్రజలు ఆశీర్వదించాలని బుచ్చిరెడ్డి కోరారు. ఈ వేడుకలలో కాంగ్రెస్ మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, యువజన విభాగం నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరంగల్ తూర్పులో ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, అభివృద్ధి ప్రదాత ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ, బడుగు బలహీన వర్గాల నాయకులు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు నేతృత్వంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దయానంద కాలనీలోని శ్రీ కనకదుర్గమాత దేవాలయంలో ఎనుముల రేవంత్ రెడ్డి పేరుమీద అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి ఆయురారోగ్యాలతో ఉండి, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మరింత సేవ చేయాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దేవతను వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ , మీసాల ప్రకాష్, కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సందేల లాజర్, కొండమీది సదానందం, సర్దార్ జస్వీర్ సింగ్, అప్ప రవి, కొగిల యాకూబ్, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు గూడ శారద, గూడ రమ్య, కాశ శ్రీదేవి, మెరుగు లలిత, బొత్తా పద్మ, స్టేషన్ రోడ్డు ఆటో యూనియన్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వరంగల్ చౌరస్తాలో దుప్పట్లు, అన్నదానం వితరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, అభివృద్ధి ప్రదాత ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజకవర్గంలో భారీ ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ, బడుగు బలహీన వర్గాల నాయకులు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ఆదేశాలతో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ భారీ కేక్‌ను కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. అనంతరం 500 మంది మున్సిపల్ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సుమారు 2,000 మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందుతున్నాయని గోపాల నవీన్ రాజ్ అన్నారు. హరిజన, గిరిజన, బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత రేవంత్ రెడ్డి గారికి దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, మీసాల ప్రకాష్, 28వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కురిమిళ్ళ సంపత్, కూరగాయల మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు జారతి శ్రీనివాస్, జారతి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు సోమిశెట్టి ప్రవీణ్, గుండు చందన పూర్ణచందర్, బాల్నే సురేష్, పోషాల పద్మ, చింతాకుల అనిల్, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ఇతర కాంగ్రెస్ నాయకులు, కొండా దంపతుల అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రఘునాథపల్లిలో పండ్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని జనగామ జిల్లాలోని రఘునాథపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి, ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, మేకల నరేందర్, గాదే మహేందర్ రెడ్డి, పేర్నే రవి కురుమ, గొరిగే రవి, లోనే శ్రవణ్, కడారి రవి, మధు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో ..



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పెద్ద కేకును కట్ చేసి, అక్కడికి వచ్చిన ప్రజలకు స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున 'రేవంత్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి', 'కాంగ్రెస్ పార్టీ జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కమలాపురం రమేష్, రేవంత్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు నేరుగా గ్రామాల ప్రజలకు అందుతున్నాయని పేర్కొన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, ఆత్మకూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎరుకొండ రవీందర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ కక్కర్ల రాధిక రాజు, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బరుపట్ల కిరీటి, యువజన నాయకులు తనుగుల సందీప్, ఉడుత మహేందర్, కంచ రవికుమార్ పాల్గొన్నారు.

# పరకాల బస్టాండ్ కూడలిలో..



**వరంగల్ వాయిస్, పరకాల:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను పరకాల పట్టణ కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పరకాల నియోజకవర్గ శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు, పరకాల మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా పరకాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి దిశగా ప్రజాపాలనలో ప్రజా సంక్షేమం కోసం పాటుపడే మహా గొప్ప నాయకుడు అని కొనియాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి వ్యక్తికి పది లక్షల ఆరోగ్యశ్రీ పథకం, కళ్యాణ లక్ష్మి పథకం, రైతు రుణ మాఫీ, రైతు భరోసా పథకాలు, తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరికి 6 కిలోల సన్న బియ్యం పంపిణీ, అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ, ప్రతి పేదవాడికి తెల్ల రేషన్ కార్డులు మంజూరు, కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ స్థాపన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని, ఆయనకు దీర్ఘాయుష్మత్త్వం కలగాలని కోరుకుంటున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు చిన్నాల గోనాథ్, దుబాసి వెంకటస్వామి, పసుల రమేష్, పర్నెం మల్లారెడ్డి, అల్లం రఘు నారాయణ, పాడి ప్రతాప్ రెడ్డి, నిట్టే బాలరాజు, చందుపట్ల రాఘవరెడ్డి, మడికొండ సంపత్, మడికొండ శ్రీను, మంద నాగరాజు, మార్క రఘుపతి, ఉడుత సంపత్, నల్లెల్ల అనిల్, లక్కం వసంత, పసుల విజయ, దాట్ల కోమల, బొచ్చు జెమిని, గోవింద సురేష్, బొచ్చు రవికుమార్ పాల్గొన్నారు.

# నరసింహా రెడ్డికి ఐపీజీఏ ఫెలోషిప్ అవార్డు



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగం ఆచార్యులు, ప్రొఫెసర్ వై.నరసింహ రెడ్డికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన "ఇండియన్ ఫార్మసీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ (ఐపీజీఏ) ఫెలోషిప్ అవార్డు – 2025" లభించింది. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం శనివారం లక్నోలోని బాబా సాహెబ్ భీం రావు అంబేద్కర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగింది. ఇండియన్ ఫార్మసీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ 37వ వార్షిక సమావేశం సందర్భంగా ఈ ఫెలోషిప్‌ను అందించారు. ఉదయం జరిగిన సమావేశంలో ఐపీజీఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ అరుణ్ గార్గ్, ఇతర ప్రముఖులు ప్రొఫెసర్ నరసింహ రెడ్డికి జ్ఞాపిక, సర్టిఫికేట్, శాలువా అందజేసి ఘనంగా సత్కరించారు. ఫార్మసీ రంగంలో విశిష్ట సేవలు అందించిన ఐపీజీఏ సభ్యులకు, నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా అసాధారణ ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు ఈ ఫెలోషిప్ అవార్డును అందజేస్తారని ప్రొఫెసర్ రెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రొఫెసర్ వై.నరసింహ రెడ్డి ఈ గౌరవాన్ని దక్కించుకోవడంపై కాకతీయ విశ్వవిద్యాలయం బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# బహిరంగ ప్రదేశాల్లో కుక్కలు, పశువుల నియంత్రణ అవసరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బహిరంగ ప్రదేశాలలో కుక్కలు, పశువుల నియంత్రణపై సుప్రీంకోర్టు ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాలను అభినందనీయంగా ఉన్నాయని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం, విద్యా సంస్థలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మందిరాలు, ఇతరత్రా బహిరంగ ప్రదేశాలలో కుక్కల బెడదను నియంత్రించేందుకు రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలి. నిమ్మల శ్రీనివాస్ ఈ మార్గదర్శకాలను స్వాగతిస్తూ కుక్కల సంతతిని అరికట్టడానికి సర్జరీలు చేసి, తిరిగి అదే ప్రదేశాలలో విడిచిపెట్టాలనే సూచన శాస్త్రీయమైన పరిష్కారమని అభివర్ణించారు. ఈ చర్య వల్ల ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు, భద్రత లభిస్తుందని తెలిపారు. అలాగే, రోడ్లపై, నేషనల్ హైవేలపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులను గోశాలలకు తరలించాలని సుప్రీంకోర్టు సూచించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ చర్య ప్రమాదాలను అరికట్టడానికి అత్యంత అవసరమని అన్నారు. పశువుల వల్ల ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులకు, వారి ప్రాణాలకు భద్రత కల్పించే చర్యగా దీనిని ఆయన అభివర్ణించారు. ఈ ముఖ్యమైన సూచనలను తక్షణమే అమలు చేయాలని నిమ్మల శ్రీనివాస్ గారు రాష్ట్ర అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ ఆందోళన



**వరంగల్ వాయిస్, వరంగల్:** శివనగర్‌లోని ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో ఈరోజు ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్ ) ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు తమ గోడును వినిపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయంగా మారాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. హాస్టళ్లలో తక్షణమే మరుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యం మెరుగుపరచాలి. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి. శివనగర్‌లోని ఎస్సీ సంక్షేమ వసతి గృహానికి వెంటనే సొంత భవనం నిర్మించాలి. సంక్షేమ హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్, వర్కర్ల పోస్టులను తక్షణమే భర్తీ చేసి, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాగర్, అఖిల్, రమేష్, ప్రశాంత్‌తో పాటు ఏఐఎస్ఎఫ్ నాయకులు, హాస్టల్ విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీపీయూఎస్ కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



**వరంగల్ వాయిస్, కరీంనగర్ :** రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు, తెలంగాణ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ అసోసియేషన్ (టీపీయూఎస్) కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను ఎన్నికల అధికారి బొడ్డుల గంగయ్య (టీపీయూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు) సహాయ ఎన్నికల అధికారి కూరపాటి వెంకటరమణ పర్యవేక్షణలో నిర్వహించారు. నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. టీపీయూఎస్ కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా చిందం శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు దీకొండ భూమయ్య, వోడ్నాల చంద్రమౌళి, ఉపాధ్యక్షులు మిట్టపెల్లి రాజేంద్ర ప్రసాద్, దూస రాజశేఖర్, అడేపు రాజేంద్ర ప్రసాద్, కొలిపాక కావ్, దాసరి రాజమల్లు, ప్రధాన కార్యదర్శి వంగ రవీందర్, కోశాధికారి మంచి కట్ల రవి, సంయుక్త కార్యదర్శులుగా డా.వేముల జమున, జల్దా భూమేశ్వర్, గట్టు రమేష్, కొండ వెంకటరాజం, సంస్థాగత కార్యదర్శిగా కూరపాటి వెంకటరమణ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గుడెల్లి లక్ష్మీనర్సయ్య, మెరుగు వెంకటరమణ, గుడ్ల మమత, ప్రచార కార్యదర్శులుగా బాసబత్తిని కుమారస్వామి, దూస శ్రీనివాస్, కార్యాలయ కార్యదర్శి దిడ్డి ప్రదీప్, కార్యనిర్వాహక సభ్యులు వంగాల రవీంద్రనాథ్, గూడూరు రాజు, బైరి మార్కండేయ, గడ్డం బుచ్చయ్య, చిమ్మని చంద్రశేఖర్, చిలుక మనోహర్ ఎన్నికయ్యారు. సన్మానం కార్యవర్గం ఎన్నిక అనంతరం మొదటి కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్.వేముల జమునను నూతన కార్యవర్గ సభ్యులు ప్రత్యేకంగా సన్మానించారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, పరకాల:** మండలంలోని పోచారం గ్రామానికి చెందిన కూస మహిపాల్ ఇటీవల పిడుగుపాటుకు గురై దుర్మరణం చెందారు. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు డా.పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.పెసరు విజయ్ చందర్ రెడ్ శనివారం మహిపాల్ కుటుంబాన్ని పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి ఆర్థిక సహాయాన్ని కూడా అందజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పరకాల మండల అధ్యక్షులు కాసగాని రాజ్‌కుమార్ గౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ బాబు యాదవ్, సీనియర్ నాయకులు కొమ్మిడి మహేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జే.రాజేందర్ రావు, మండల ఉపాధ్యక్షులు ఎస్.భాస్కర్, మండల కార్యదర్శి కె.రమేష్, మండల కోశాధికారి ఎదునూరి లింగయ్య, కె.వీరాస్వామి, ఎస్.సంతోష్, మాజీ సర్పంచ్‌లు ఎ.సురేష్, బాపిరెడ్డి, నాయకులు ఓదెలు, కె.సాంబయ్య, సదయ్య, క్రాంతి యాదవ్, మొగిలి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు చేయూత



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండల కేంద్రానికి చెందిన నాగేల్లి ఆనందం, తణుగుల ప్రభాకర్ ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న ఆత్మకూర్ మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఎరుకొండ రవీందర్ గౌడ్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించిన రవీందర్ గౌడ్ వారిని ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మీకు ఏ ఆపద వచ్చినా మేము అండగా ఉంటాము" అని భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయంతో పాటు, ప్రతి కుటుంబానికి చెరో 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బరుపట్ల కిరీటి, మాజీ సర్పంచ్ నాగలి సామేలు, జన్ను సాంబయ్య, సంగే రాజు, నాగేల్లి ఆంధ్రయ్య, జన్ను కోటి, బరపట్ల అన్వేష్, నాగేలి స్వామి, ఇందిరా కాలనీ పురుషుల పొదుపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

## కార్పొరేటర్ పల్లం పద్మ రవి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన 'సిరి బ్యూటీషియన్ అకాడమీ' రెండవ బ్రాంచ్‌ను ముఖ్యఅతిథిగా 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి శనివారం పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పల్లం పద్మ రవి మాట్లాడుతూ అకాడమీ యాజమాని సరితకి శుభాకాంక్షలు తెలియజేశారు. "మెరుగైన సేవలు అందిస్తూ, అందరి మన్ననలు పొంది, మంచి పేరు తెచ్చుకోవాలి" అని ఆకాంక్షించారు. మహిళా సాధికారతపై ఆమె మాట్లాడుతూ, మహిళలు వ్యాపార, వాణిజ్యంతో పాటు వివిధ రంగాలలో మరింత ముందుకు వచ్చి రాణించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కార్పొరేటర్ గారితో పాటు 32వ డివిజన్‌కు చెందిన మహిళలు, హనుమకొండ స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# టీపీయూఎస్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



**వరంగల్ వాయిస్, మహబూబ్ నగర్ :** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం (టీపీయూఎస్) ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా (నాగర్ కర్నూలు, వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాలతో కలిపి) నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది.మహబూబ్ నగర్‌లోని శ్రీ శివ మార్కండేయ దేవాలయంలో టీపీయూఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దేవులపల్లి రాజేశ్వర్ ఎన్నికల అధికారిగా ఈ నూతన కమిటీని ప్రకటించారు. గత కార్యవర్గం పదవీకాలం మూడేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో జిల్లా సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గం కూడా మూడేళ్లపాటు పదవిలో కొనసాగుతుందని ఎన్నికల అధికారి శ్రీ దేవులపల్లి రాజేశ్వర్ ప్రకటించారు. టీపీయూపీఎష్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా కెంచే సుభాష్ చంద్ర, అసోసియేట్ అధ్యక్షులు డా.ధర్మపురి సునీల్, అసోసియేట్ అధ్యక్షులుగా వన్నెల శ్రీనివాస్ కుమార్, ఉపాధ్యక్షులుగా వస్త్రాల ఆంజనేయులు, ఉపాధ్యక్షులు మ్యాకం శ్యాంసుందర్, ఉపాధ్యక్షులుగా పల్లటీ రఘురాములు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ సంతోషిని, ప్రధాన కార్యదర్శికుకుడాల బాలకృష్ణ, ఆర్గనైజేషనల్ కార్యదర్ శిమేకల సూర్యనారాయణ, సహాయక కార్యదర్శి బేతి శ్రీపాదరావు, సహాయక కార్యదర్శికెంచే ప్రభాకర్, సహాయక కార్యదర్శిజన్ను వెంకటస్వామి, సహాయక కార్యదర్శి పగడాకుల సంయుక్త, కోశాధికారిగా కడదాసు శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుర్రం కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గోరెంట్ల ఆంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పల్నాటి కృష్ణకుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగడ్డం కరుణ, ప్రచార కార్యదర్శిశ్రీ దివాకర్, కార్యాలయ కార్యదర్శి భోగం చరణ్ తేజ, కార్యవర్గ సభ్యులుగా కెంచే మహేష్, భీంపల్లి శ్రీనివాసులు, కెంచే రామచంద్రయ్య, కుకుడాల శ్రీనివాసులు, ఎస్ విజయలక్ష్మి, భోగం వెంకటేష్ ఎన్నికయ్యారు.

# ప్రపంచ చరిత్రలో అక్టోబర్ విప్లవం స్ఫూర్తిదాయకం

## ▪ ఎంసీపీఐ(యూ) నేత వల్లేపు ఉపేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రష్యన్ అక్టోబర్ విప్లవం ప్రపంచ చరిత్రలో ఎంతో ఆదర్శంగా నిలిచిందని, అది బూర్జువా, భూస్వామ్య, పెట్టుబడిదారీ దోపిడీ విధానాలకు ప్రత్యామ్నాయంగా సమ సమాజాన్ని ఆచరణలో నిరూపించిందని ఎంసీపీఐ(యూ) పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వల్లేపు ఉపేందర్ రెడ్డి అన్నారు. అదే స్ఫూర్తితో నేడు దేశంలో పెరిగిపోతున్న మతోన్మాదం, యుద్ధోన్మాదం, ఫాసిజంకు వ్యతిరేకంగా పోరాడాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఎంసీపీఐ(యూ) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రష్యన్ అక్టోబర్ విప్లవ 108వ వార్షికోత్సవాల సందర్భంగా 'సామ్రాజ్యవాద యుద్ధ, మతోన్మాద, ఫాసిజంనకు వ్యతిరేకంగా' సభ నిర్వహించారు. భద్రకాళి కాలనీ, ములుగు రోడ్, కర్ర రాజి రెడ్డి నివాసంలో జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ దామరకొండ రమేష్ అధ్యక్షతన జరిగే ఈ సభకు ముఖ్య అతిథిగా ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యులు వల్లేపు ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామ్రాజ్యవాద దోపిడీ విధానాలు, నిరంకుశత్వ నియంతృత్వ పాలనలకు ప్రత్యామ్నాయంగా కార్మిక రాజ్యాన్ని స్థాపించి, శ్రామికులకు రష్యన్ విప్లవం అండగా నిలిచిందని అన్నారు. సమాజ అభివృద్ధికి కీలకమైన భూ పంపిణీ, కార్మిక, మహిళా హక్కులను, సంపదలను అందరికీ సమానంగా దక్కేలా చేసి, సమ సమాజం వైపు అడుగులు వేయడంలో రష్యన్ విప్లవం వేగుచుక్కలా నిలిచిందని కొనియాడారు. వివిధ ప్రాంతాలుగా విడిపోయి ఉన్న రష్యాను ఐక్యం చేసి, శాంతిని నెలకొల్పి సోషలిస్టు రష్యాగా ఏర్పడటం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రపంచంలో పెరిగిపోతున్న యుద్ధోన్మాదానికి, సామ్రాజ్యవాద నియంతృత్వానికి, మతోన్మాద దోపిడీ పద్ధతులకు వ్యతిరేకంగా శ్రామికులంతా ఐక్యంగా ఎర్ర జెండా పట్టుకుని పోరాడాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని పిలుపునిచ్చారు. దేశంలోని పెట్టుబడిదారీ, మతోన్మాద దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు, సామాజిక శక్తులు ఐక్యంగా నిలబడి ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పరిచే విధంగా కృషి జరగాలని అన్నారు. దారులు చీలి ఉన్న కమ్యూనిస్టు పార్టీలను ఒక్కటి చేసేందుకు ఎంసీపీఐ(యూ) ప్రయత్నిస్తోందని, అందుకోసం దేశంలోని కొన్ని కమ్యూనిస్టు పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. వర్గ, సామాజిక జెమిలి పోరాటాలను ఉధృతం చేసేందుకు కార్యాచరణ రూపొందించిందని, అందులో భాగంగానే ఈ నెల 7 నుంచి 17 వరకు అక్టోబర్ విప్లవ వార్షికోత్సవాల సందర్భంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి నీల రవీందర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, కర్ర రాజి రెడ్డి, చీపురు ఓదయ్య, జిల్లా కమిటీ సభ్యులు కుసం బుచ్చయ్య, కూతురు ఇంద్ర రెడ్డి, మంద భద్రయ్య, బలుగురి రాజేశ్వర్ రావు, పార్టీ సభ్యులు కర్ర మనోహదర, కర్ర సీతారాం రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా 'సప్తశక్తి సంగం' సదస్సు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పద్మాక్షి కాలనీలో గల శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో శనివారం ఉదయం 'సప్తశక్తి సంగం' పేరిట మహిళా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ మహిళా వైద్యురాలు, రాష్ట్ర సేవికా సమితి నాయకురాలు డాక్టర్ మాగంటి అరుణ అధ్యక్షత వహించగా, రిటైర్డ్ ఏఏంఓ బోయినపల్లి రాధ, రిటైర్డ్ టీచర్ సందివెన మంజుల వాణి ప్రధాన వక్తలుగా విచ్చేశారు. ముందుగా మాట్లాడిన బోయినపల్లి రాధ భారతదేశ ఉన్నతిలో మహిళల పాత్ర అమూల్యమైనది అని అన్నారు. హద్దులు లేని వాత్సల్యాన్ని చూపించే స్వభావాన్నే మాతృత్వం అంటారని, మాతృత్వ భావన కలిగిన అన్ని తత్వాలను 'తల్లి' అంటారని ఆమె వివరించారు. అనంతరం మంజుల వాణి మాట్లాడుతూ, భారతీయ జీవన వ్యవస్థలో ఉన్న నాలుగు ఆశ్రమ ధర్మాలకు పునాది భారతీయ కుటుంబ వ్యవస్థలోనే ఉన్నదని అన్నారు. కుటుంబాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మహిళలపై ఉందని తెలిపారు. మహిళలు పర్యావరణ స్పృహ కలిగి, ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. ముఖ్య అతిథి, అధ్యక్షురాలు డాక్టర్ మాగంటి అరుణ మాట్లాడుతూ, పిల్లల మనసులలో ఇంటి పనుల పట్ల గౌరవాన్ని, అందరితో కలిసి సహజంగా భోజనం చేయాలనే భావనను పెద్దలు కలుగజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతీ శిశు మందిర్ ప్రధాన ఆచార్యులు ఊకంటి మున్నెమ్మ, ఇతర ఆచార్యులు, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు, హితైషులు, ప్రబంధకారి సభ్యులు, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెన్షనర్లకు బకాయిలు చెల్లించాలి

## ■ 17న ఇందిరా పార్క్‌లో పెన్షనర్ల మహా ధర్నా



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ తెలంగాణ (ఎస్ జీపీఏటీ) హనుమకొండ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం శనివారం హనుమకొండ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు ఈ.నరసింహారెడ్డి అధ్యక్షత వహించారు. అధ్యక్షులు ఈ.నరసింహారెడ్డి మాట్లాడుతూ మార్చి 2024 నుంచి అక్టోబర్ 2025 వరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన రిటైర్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 20 నెలల కాలంగా ప్రభుత్వం పెన్షన్ తప్ప ఎలాంటి ప్రయోజనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయంగా రావలసిన జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్మెంట్, కమ్యుటేషన్, గ్రాట్యుటీ, 2020 పీఆర్సీ ఏరియర్స్, డీఏ ఏరియర్స్ వంటి ప్రయోజనాలు అందకపోవడంతో తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని తెలిపారు. "మేము దాచుకున్న డబ్బులను మాకు ఇవ్వకుండా, ఇతర పథకాలకు ఉపయోగించుకొని మమ్మల్ని బాధించడం సరైన విధానం కాదు, ప్రభుత్వానికి తగనిది" అని ఆయన విమర్శించారు. బకాయిలు రాక అనారోగ్యంతో అసువులు బాసిన వారు కూడా ఉన్నారని, ఒక ఉపాధ్యాయుడు ఆవేదనతో ఇంటి నుండి వెళ్లిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ తరపున ముఖ్యమంత్రికి, చీఫ్ సెక్రటరీ గారికి అనేక విజ్ఞాపన పత్రాలు సమర్పించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో మహా ధర్నా కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్లు ప్రకటించారు. మార్చి 2024 నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులు మరియు పెన్షనర్లందరూ ఈ మహా ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వీరస్వామి గారు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు బెనిఫిట్స్ రాక పిల్లల పెండ్లిళ్లు చేయలేక, ఇండ్లు కట్టుకోలేక, అప్పులు కట్టలేక, బ్యాంకు ఈఎంఐలు కట్టలేక మానసిక వేదనతో అనేక రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ నెల 15 లోగా రిటైర్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో 17న జరిగే మహా ధర్నాకు ఉద్యోగులంతా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు టీ. పురుషోత్తం, జిల్లా కమిటీ సభ్యులు ప్రకాష్, యం.సింగారెడ్డి, కె.రమేష్, జి.సత్యనారాయణ, శ్యామ్ సుందర్ రెడ్డి, హనుమకొండ ఎస్.టీ.ఓ.యూనిట్ అధ్యక్షులు ఎల్.ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కందుకూరి దేవదాసు, చింతగట్టు క్యాంపు అధ్యక్షులు వెంకటేశ్వర్లు, భీమదేవరపల్లి బాధ్యులు పి.రాజిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జ్యోతిరమణి, రాజకొమురమ్మ, విజయలక్ష్మి, సుబ్బారావు, సుగుణాకర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పగడాల పరామర్శ



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన కోరే సమ్మక్క గారు ఇటీవల మరణించారు. ఈ విషాదకర సంఘటన నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పగడాల కాళీ ప్రసాద్ రావు శనివారం సమ్మక్క కుటుంబ సభ్యులను పరామర్శించారు. డా.పగడాల కాళీ ప్రసాద్ రావు మృతురాలి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు కొట్టె రమేష్, ప్రధాన కార్యదర్శి గండు ముకేష్ గౌడ్, బూత్ అధ్యక్షులు చక్క సతీష్, పోతరాజు శ్రీకాంత్, అకినపల్లి శ్రీనివాస్, మేడిపల్లి కుమారస్వామి, మంద రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా పరిధిలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి శనివారం ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలకు తమ ధాన్యాన్ని అమ్మకానికి తీసుకువచ్చిన రైతులతో అదనపు కలెక్టర్ నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే, రైతులు ఆరబోసిన ధాన్యం నాణ్యతను కూడా పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద కల్పించిన ఏర్పాట్లు, కొనుగోలు ప్రక్రియ గురించి వివరాలు తెలుసుకున్న అనంతరం కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలని నిర్వాహకులకు అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి స్పష్టమైన సూచనలు జారీ చేశారు.

# రేడియాలజిస్ట్ శ్రీకాంత్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, రామన్నపేట:** వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'రేడియాలజిస్ట్ డే' సందర్భంగా ఒక సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ ని శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించడం జరిగింది. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య రంగంలో రేడియాలజీ (రేడియాలజిస్ట్) సబ్జెక్టుకు చాలా ప్రాముఖ్యత ఉందని అన్నారు. ఎక్స్–రే ద్వారా ఎముకలు విరిగినా, అరిగినా లేదా ఇతర జబ్బులు ఉన్నా అలాగే సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి పరీక్షలలో రేడియాలజిస్ట్‌ల పాత్ర చాలా ముఖ్యం అని ఆయన వివరించారు. సన్మానం అందుకున్న డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి ఇలా సన్మానించడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ రాజేంద్రప్రసాద్ తో పాటు ఆర్గనైజర్ శ్రవణ్, కోఆర్డినేటర్ మోహన్ వారణాసి, ఎం. హనుమంతరావు, సిబ్బంది శివ, ప్రతిభ, సన కౌసర్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# 9న ఉచిత మెగా వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అవోపా హనుమకొండ వారి ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ అద్భుతమైన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హనుమకొండ సుబేదారిలోని అవోపా భవన్ లో బీపీ, షుగర్, ఈసీజీ, తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నారు. ఈ శిబిరంలో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడానికి గుండె వైద్య నిపుణులు, జనరల్ ఫిజీషియన్, ఎముకల కీళ్ల స్పెషలిస్టులు, దంత వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారు. ఈ శిబిరంలో భాగంగా సమాజంలో అత్యంత ముఖ్యమైన సీపీఆర్ పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించబడుతుంది. గుండె ఆగిపోయిన వారికి అందించే హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనం విధానాన్ని నిపుణులు నేర్పిస్తారు. సీపీఆర్ పద్ధతిని నేర్చుకోవడం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడిన వారవుతారు కాబట్టి, ప్రతి ఒక్కరూ ఈ ముఖ్యమైన కార్యక్రమంలో తప్పకుండా పాల్గొనాలని అవోపా విజ్ఞప్తి చేసింది. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలనిఅవోపా హనుమకొండ అధ్యక్షుడు దొంతుల ఈశ్వరయ్య, సెక్రెటరీకంతాల భాస్కర రావు, సెక్రెటరీ గంప సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గన్ను సురేందర్, చైర్మన్ డాక్టర్ జ్ఞానేశ్వర్, క్యాంప్ ఇన్‌చార్జ్ డాక్టర్ గుండా రవీందర్, వైస్ ఇన్‌చార్జ్ శివకుమార్ కోరారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

## హనుమకొండ ఏసీపీ నరసింహారావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈనెల 10 నుంచి జేఎన్ఎస్ స్టేడియంలో అగ్ని వీర్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ జరుగుతున్న సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి వస్తున్న అభ్యర్థుల ఉద్దేశించి హనుమకొండ ఏసీపీ నరసింహారావు పలు సూచనలు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఏసీపీ నరసింహారావు మాట్లాడుతూ ఈ ఉద్యోగాల ఎంపిక ఆర్మీ రిక్రూట్మెంట్ సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో చాలా పారదర్శకంగా జరుగుతుంది. ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు తీసుకునే దళారుల మాటలు విని మోసపోవద్దని, అటువంటివారు ఎవరైనా మీకు తెలిస్తే వెంటనే డయల్ 100 కాల్ చేసి పోలీసు వారికి తెలియజేయాలని కోరారు. ఈ నెల 10 నుంచి 23 వరకు ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ జరుగుతున్న సందర్భంగా ప్రతిరోజు జేఎన్ఎస్ గ్రౌండ్ లో వాకింగ్, ఇతర స్పోర్ట్స్ ప్రాక్టీస్ చేసే వారికి లోపలికి అనుమతి ఉండదని కావున పోలీసు వారికి సహకరించగలరని కోరారు.

# 9న దామెరలో మెగా వైద్య శిబిరం




**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద గల చందుపట్ల కోట ఫంక్షన్ హాల్ లో ఆదివారం ఉదయం 9 గంటలకు మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు దామెర రెడ్డి సంఘం అధ్యక్షుడు పోల్సాని ఇంద్రారెడ్డి తెలిపారు. వైద్య శిబిరంలో వివిధ రకాల స్పెషలిస్ట్ డాక్టర్లు గుండె, ఎముకల, చిల్డ్రన్స్, గైనకాలజిస్ట్, జనరల్ డాక్టర్లు పాల్గొననున్నారని తెలిపారు. ప్రజలు వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

# గాలి మాటలు, గారడీ చేతలు

## ▪ కాంగ్రెస్‌పై బీజేపీ నేతల విమర్శ



**వరంగల్ వాయిస్, శివనగర్ :** తెలంగాణ యూత్ కాంగ్రెస్ నాయకులు శివనగర్ మండలంలో చేపట్టిన 'ఓటు చోరీ' ఆరోపణల కార్యక్రమంపై బీజేపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. బీజేపీ శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ గారు కాంగ్రెస్ పార్టీ వైఖరిని తీవ్రంగా ఖండించారు. మహమ్మద్ రఫీ కాంగ్రెస్ పార్టీ తీరును గాలి మాటలు, గారడీ చేతలు, అభివృద్ధికి దూరం, గుర్తింపు కోసం ఆరాటం, ఓటమి భయంతో నీచమైన కుట్రలు అని అభివర్ణించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు నెరవేర్చలేక కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయింది. ముఖం చూపించలేక, ఓటమి భయంతో ఇలాంటి అసత్య ప్రచారాలు, నీచ రాజకీయాలకు తెగబడుతోంది. నోరుంది కదా అని ఏది పడితే అది మాట్లాడితే సమాజం ఊరుకోదు. తమ పార్టీకి ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పట్ల పూర్తి విశ్వాసం ఉంది. మొన్నటిదాకా ఈవీఎంల గురించి మాట్లాడిన రాహుల్ గాంధీ, ఈవీఎంలను తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అనగానే మౌనం వహించారు. ఇప్పుడు 'ఓటు చోరీ' అంటూ అరుస్తున్నారు. భారతదేశంలో మొట్టమొదట ఓటు చోరీ చేసింది రాహుల్ గాంధీ తల్లి సోనియా గాంధీ అని చెప్పగానే మళ్లీ మూసుకున్నారు. బీహార్‌లో గెలిచే అవకాశం లేకపోవడంతో, దేశంలో ఏదో ఒక వివాదం సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని అక్కడ రాహుల్ గాంధీ, ఇక్కడ రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో బీజేపీ 4 ఎంపీ సీట్లు గెలిచింది, ఇప్పుడు 8 అయ్యాయి. కాంగ్రెస్ 3 ఎంపీ సీట్లు గెలిచింది, ఇప్పుడు 8 అయ్యాయి. ఈ పెరుగుదల చూసి, కాంగ్రెస్ పార్టీ కూడా ఓటు చోరీ చేసి గెలిచిందా అని మేము కూడా అనవచ్చు. వరంగల్ తూర్పులో కేవలం 5 వేల ఓట్ల తేడాతో గెలిచిన మంత్రి సురేఖ కూడా ఓటు చోరీ చేసే గెలిచారని మేము అనవచ్చు, కానీ అది మా సంస్కృతి కాదన్నారు. దమ్ముంటే తక్షణమే 42 శాతం బీసీ



రిజర్వేషన్లు ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలి. 420 హామీలు, ఆరు గ్యారంటీలతో మోసం చేయడమే కాకుండా, మరోసారి తెలంగాణ బీసీలను మోసం చేయడానికి ఈ కపట ప్రేమ, కపట నాటకాలు ఆడుతున్నారని, తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. రాజ్యాంగం చేతుల్లో పట్టుకుని తిరగడం కాదు, రాజ్యాంగ విలువలను పాటించాలి. ఆరోపణలు చేసి, ఆధారాలు అడిగితే తప్పించుకుని పోవడం ముఖ్యంగా రాహుల్ గాంధీకి, రేవంత్ రెడ్డికి అలవాటేనని మండిపడ్డారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఆ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారు. వరంగల్‌ను రెండో రాజధాని అంటున్నారే తప్ప, కనీసం నిధులు విడుదల చేయకుండా ప్రజలను మాయ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్‌కు కనీసం బస్టాండ్‌ను కూడా నిర్మించలేని దౌర్భాగ్య స్థితిలో రేవంత్ సర్కారు ఉంది. జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి ఆగిపోయిందని, రేవంత్ సర్కారు మరో మోసానికి పాల్పడుతోందని మండిపడ్డారు. ఇక్కడి జిల్లా మంత్రులు నిధులు తేవడంలో పూర్తిగా విఫలమై, కేవలం రేవంత్‌కు తొత్తులుగా మారి ప్రజా ప్రయోజనాలను గాలికి వదిలేశారని విమర్శించారు. 42శాతం రిజర్వేషన్ అంటూ హడావుడి చేస్తున్న రేవంత్ సర్కార్‌కు చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతోందన్నారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు తగిన బుద్ధి చెప్పేందుకు ఓరుగల్లు ప్రజలు సిద్ధమయ్యారని స్పష్టం చేశారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయం అని రంజిత్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, జిల్లా నాయకులు బైరి శ్యాంసుందర్, ముత్తినేని శ్రీనివాస్, మెంగని నరేష్, శివనగర్ మండల నాయకులు కందుకూరి విజయ్ కుమార్, బోడకుంట్ల శివశంకర్, గట్ల శరత్, ముద్దసాని అఖిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'కపాస్ కిసాన్ యాప్' రద్దు చేయాలి




◆ ఓపెన్ మార్కెట్ ద్వారా పత్తి కొనుగోలుకు అనుమతించాలి

◆ సీపీఐ నాయకుడు షేక్ బాషి మియా

**వరంగల్ వాయిస్, గీసుగొండ :** మండలంలోని ధర్మారం గ్రామంలో సీపీఐ మండల సమావేశం ఎం.ఏ.పాషా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషి మియా ముఖ్య అతిథిగా హాజరై, రైతు సమస్యలు, పార్టీ కార్యక్రమాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. రైతులకు నష్టం కలిగించే విధంగా ఉన్న "కపాస్ కిసాన్ యాప్"ను తక్షణమే రద్దు చేయాలని షేక్ బాషి మియా డిమాండ్ చేశారు. రైతులు తమ పత్తిని స్వేచ్ఛగా, ఎటువంటి నిబంధనలు లేకుండా ఓపెన్ మార్కెట్ల ద్వారా విక్రయించుకునే అవకాశాన్ని కల్పించాలి."స్లాట్ బుక్ చేసుకొని పత్తి అమ్మాలన్న నిబంధన రైతులపై మోపిన భారమని, ఇది మోడీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు మరో ఉదాహరణ" అని ఆయన విమర్శించారు. సీసీఐ పత్తి కొనుగోలుపై పెట్టిన అన్యాయమైన షరతులను షేక్ బాషి మియా తీవ్రంగా వ్యతిరేకించారు. "12 శాతం కన్నా తేమ ఎక్కువగా ఉన్న పత్తిని కొనలేమంటూ సీసీఐ రైతులను ఇబ్బంది పెడుతోంది. ఎటువంటి కండిషన్ లేకుండా 20 శాతం తేమ ఉన్న పత్తిని కూడా కొనుగోలు చేయాలి" అని డిమాండ్ చేశారు. "ఎకరానికి ఏడు క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేస్తామన్న నిబంధనను కూడా సీసీఐ రద్దు చేయాలి. రైతులు ఉత్పత్తి చేసిన ఎన్ని క్వింటాళ్ల పత్తి ఉన్నా కొనుగోలు చేయాలి" అని స్పష్టం చేశారు. అలాగే, రైతులకు న్యాయం జరిగేందుకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన ధరల ప్రకారం పంటలను కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.100 సంవత్సరాల చరిత్ర గల సీపీఐ పార్టీ శతజయంతి ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని షేక్ బాషి మియా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. డిసెంబర్ 26 న ఖమ్మంలో జరగబోవు ముగింపు సభలో ప్రపంచ దేశాల నుంచి 40 దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారని, ఐదు లక్షల మందిపై చిలుకు ప్రజలతో భారీ బహిరంగ సభను జయప్రదం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ గీసుగొండ మండల కార్యదర్శి తోట చంద్రకళ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, వరంగల్ మండల కార్యదర్శి గుండె బద్రి, పార్టీ నాయకులు శ్వేత, రాజేష్, బి.భారతి, సుక్క శోభ, సుక్క మొగిలి, రాజారామ్, రత్నాకర్ రెడ్డి, కమల తదితరులు పాల్గొన్నారు.

# ఆ కోరిక ఇన్నాళ్లకు తీరింది

▫ జబర్దస్త్ ఫేం అదిరే అభి ▫ రాజ్‌తరుణ్ హీరోగా చిరంజీవ



'జబర్దస్త్'తో బుల్లితెర ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన వేణు, ధన్‌రాజ్‌లాంటి కమెడియన్లు.. దర్శకులుగా ఎమోషనల్ చిత్రాలు తీసి మెప్పించారు. అదే షోతో సందడి చేసిన అదిరే అభి (అభినయ కృష్ణ) డైరెక్టర్ కావాలన్న తన ఎన్నో ఏళ్ల కలను 'చిరంజీవ' తో నెరవేర్చుకున్నారు. సోషియో ఫాంటసీ టచ్‌తో ఎంటర్‌టైనర్‌గా దాన్ని రూపొందించారు. రాజ్‌తరుణ్ హీరో, కుషిత కల్లపు హీరోయిన్‌గా తీసిన మూవీ ఓటీటీ 'ఆహా' లో రిలీజ్ అయింది. హైదరాబాద్‌కు చెందిన శివ (రాజ్‌తరుణ్)కు దూకుడెక్కువ. ఆ వేగమే అతడిని అంబులెన్స్ డ్రైవర్‌ని చేస్తుంది. ఇతరుల ఆయుష్షు ఎప్పటి వరకూ ఉందో తెలుసుకునే పవర్ తనకు ఉందని ఓ రోడ్డు ప్రమాదంతో శివకు అర్థమవుతుంది. దాన్ని 'క్యాష్' చేసుకుని, తన అప్పులన్నీ తీర్చేయాలని నిర్ణయించుకుంటాడు. కార్పొరేటర్ సత్తు పహిల్వాన్‌తో ఓ డీల్ మాట్లాడతాడు. ఆ ఒప్పందమేంటి? డబ్బు కోసం అలా చేయడం తప్పని భావించిన తర్వాత శివ ఏం చేశాడు? ఓ భారీ ప్రమాదం నుంచి ఎంతోమందిని రక్షించేందుకు ప్రయత్నించిన శివకీ, స్థానిక ఎమ్మెల్యేకీ ఉన్న వైరం ఏంటి? తోటి మనిషి ఆయుష్షు ఎంతో చెప్పే వరం శివకు ఎలా వచ్చింది? తదితర అంశాల సమాహారమే 'చిరంజీవ'. 'చిరంజీవ' కూడా అలా యముడి చుట్టూ అల్లుకున్న కథే. కానీ, ఇందులో ఆయన గురించి చెప్పే సన్నివేశాలే తప్ప ప్రత్యేకంగా పాత్రంటూ ఉండదు. మనిషి చావుకు నిజంగా యమధర్మరాజే కారకుడా? అని ప్రశ్నించుకునేలా చేస్తుందీ చిత్రం. హీరో పొందిన వరం గురించి సినిమా ప్రారంభంలోనే తెలుస్తుంది. దాన్ని ఎలా వాడాడన్నదే కీలకం. అంబులెన్సు డ్రైవర్‌గా కథానాయకుడి పరిచయం, వెహికల్‌ను వేగంగా నడపకపోవడాన్ని కారణంగా చెబుతూ మృతుల బంధువులు అతడితో వాగ్వాదానికి దిగడం, దాంతో అతడు మరో ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేయడం.. ఇలా సరదా సన్నివేశాలతో ప్రారంభమవుతుందీ సినిమా. తనకున్న వరమేంటో ఒకానొక సమయంలో గ్రహించిన శివ.. దాని ద్వారా డబ్బులు సంపాదించే ప్రయత్నాలు నవ్వులు పూయిస్తాయి. అయితే, లాజిక్స్ పట్టించుకోకపోతేనే అందులోని ఫన్ ఆస్వాదించగలం. హీరోయిన్ కుషిత కల్లపు అందం, అభినయంతో ఆకట్టుకుంటుంది. రచ్చ రవి తదితరులు చిన్న పాత్రల్లో సందడి చేశారు. దర్శకుడిగా అభి తొలి ప్రయత్నం మెప్పిస్తుంది.



# రజనీకి అరుదైన గౌరవం

అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో సన్మానం భారతీయ చలనచిత్ర పరిశ్రమకు సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలు అందించిన సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కనుంది. ఇటీవల నట జీవితంలో 50 ఏళ్ల ఘన ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా 56వ అంతర్జాతీయ చలనచిత్ర ఉత్సవం ముగింపు వేడుకలో రజనీకాంత్‌ను సన్మానించనున్నారు. ఈ సన్మానం ఐఎఫ్ఎఫ్ఐకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుండగా.. గోవా వేదికగా నవంబర్ 20 నుంచి 28 వరకు ఈ వేడుక జరగనుంది. బస్ కండక్టర్‌గా జీవితం ప్రారంభించిన శివాజీ రావు గైక్వాడ్ అలియాస్ రజనీకాంత్? 1975లో లెజెండరీ దర్శకుడు కె. బాలచందర్ రూపొందించిన 'అపూర్వ రాగంగళ్' చిత్రంతో నట జీవితాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా, తనదైన స్టైల్‌తో, విలక్షణమైన పాత్రలతో కోట్లాది మంది అభిమానుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు. తన యాక్షన్, స్టైలింగ్‌తో ఇండియా అంతటా సూపర్‌స్టార్‌గా గుర్తింపు సాధించాడు. ఇక ఈ ఎఈఈఏ వేడుకల్లో గురు దత్, రాజ్ ఖోస్లా, రిత్విక్ ఘటక్, పి. భానుమతి, భూపేన్ హజారికా వంటి పలు దిగ్గజ కళాకారుల శత జయంతి వేడుకలు కూడా జరగనున్నాయి. ఈ తొమ్మిది రోజుల ఉత్సవంలో 81 దేశాల నుండి 240కి పైగా చలనచిత్రాలను ప్రదర్శించనున్నారు.

# చక్‌దే ఎక్స్‌ప్రెస్ విడుదలలో కదలిక





మహిళల వన్డే ప్రపంచ కప్‌ను టీమ్‌ఇండియా సగర్వంగా సొంతం చేసుకొని చరిత్ర సృష్టించింది. ఈ నేపథ్యంలో అనుష్క శర్మ నటించిన 'చక్‌దే ఎక్స్‌ప్రెస్' మరోసారి చర్చనీయాంశమవుతోంది. అనుష్క శర్మ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా షూటింగ్ ఏడేళ్ల క్రితం పూర్తయినా ఇప్పటివరకూ విడుదలకు నోచుకోలేదు. అయితే, ఇటీవల మన అమ్మాయిలు ప్రపంచ కప్ సాధించిన నేపథ్యంలో ఈ సినిమా విడుదల చేయాలని అభిమానులు పోస్టులు పెట్టడంతో.. నిర్మాతలు దీన్ని రిలీజ్ చేయాలని భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా విడుదల కోసం నెట్‌ఫ్లిక్స్‌తో చిత్రబృందం చర్చలు కూడా జరిపినట్లు తెలుస్తోంది. 'చక్‌దే ఎక్స్‌ప్రెస్' కోసం అనుకున్న దానికంటే బడ్జెట్ ఎక్కువవడంతో అభిప్రాయ భేదాలు వచ్చి సినిమా విడుదల ఆగిపోయిందని ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే వన్డే ప్రపంచకప్‌ను భారత అమ్మాయిలు గెలుచుకున్న నేపథ్యంలో దీన్ని ఇప్పుడు విడుదల చేస్తే ఆదరణ సొంతమవుతుందని చిత్రబృందం భావించినట్లు తెలుస్తోంది. ఈ నెలలోనే దీనిపై తుదినిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.
భారత దిగ్గజ మహిళా క్రికెటర్ ఝులన్ గోస్వామి జీవితం ఆధారంగా.. అనుష్కశర్మ ప్రధాన పాత్రధారిగా 'చక్‌దే ఎక్స్‌ప్రెస్' రూపొందింది. ఈ చిత్రానికి ప్రొసిత్‌రాయ్ దర్శకత్వం వహించగా, కర్ణేష్ శర్మ నిర్మాతగా వ్యవహరించారు. హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ప్రపంచకప్ గెలిచినప్పుడు ఈ సినిమాను విడుదల చేయాలని కోరుతూ అభిమానులు పోస్టులు పెట్టిన విషయం తెలిసిందే.



# అవును, విజయ్‌ను పెళ్లి చేసుకోబోతున్నా

**తనకోసం నిలబడే వ్యక్తి కావాలనుకున్నా**

ఎట్టకేలకు రష్మిక తన పెళ్లిపై క్లారిటీ ఇచ్చారు. నటుడు దేవరకొండ విజయ్‌ను వివాహం చేసుకో బోతున్నట్లు చెప్పారు. అలాగే ఎంగేజ్‌మెంట్ విషయంలో మీరు అనుకున్నదే నిజమని ఒప్పుకున్నారు.
తన కోసం యుద్ధం చేసే జీవిత భాగస్వామి కావాలని నటి రష్మిక తాజాగా ఓ చిట్‌చాట్‌లో తెలిపారు. వరుస సినిమాలు, విజయ్ దేవరకొండతో నిశ్చితార్థం వార్తలతో గతకొన్ని రోజులుగా నిత్యం రష్మిక ట్రెండింగ్‌లో ఉంటోన్న విషయం తెలిసిందే. తాజాగా ఒక యూట్యూబ్ ఛానల్ చిట్‌చాట్‌లో ఆమె పాల్గొన్న సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు ఆసక్తికర సమాధానం చెప్పారు. తన భాగస్వామి ఎలా ఉండాలని కోరుకుంటున్నారో చెప్పాలని ఒక అభిమాని కోరగా రష్మిక నవ్వుతూ దానికి సమాధానమిచ్చారు. ప్రపంచం మొత్తం తనకు వ్యతిరేకంగా ఉన్నా కూడా తన కోసం నిలబడే జీవిత భాగస్వామి కోసం వెతుకుతున్నట్లు వివరించారు. నిజాయితీగా చెప్పాలంటే నన్ను లోతుగా అర్థం చేసుకునే వ్యక్తి. ప్రతి విషయాన్ని నావైపు నుంచి ఆలోచిస్తూ అర్థం చేసుకోవాలి. అన్ని పరిస్థితులను ఎదుర్కొనే వ్యక్తి.. ఒకవేళ మీరు డేట్ చేస్తే ఎవరితో చేస్తారు? పెళ్లి చేసుకుంటే ఎవరిని చేసుకుంటారు? అని మరో అభిమాని అడగ్గా.. డేట్ చేస్తే యానిమేషన్ క్యారెక్టర్ నరుటోతో చేస్తా. ఎందుకంటే నాకు నరుటో పాత్ర చాలా ఇష్టం. పెళ్లి చేసుకుంటే విజయ్‌ని చేసుకుంటా అని చెప్పారు. ఈ సమాధానంతో ఆడియన్స్ అందరూ పెద్దగా అరుస్తూ కంగ్రాట్స్ చెప్పారు. రష్మిక థాంక్స్ చెప్పారు. అక్టోబర్ 3న రష్మిక, విజయ్‌ల నిశ్చితార్థం జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించనప్పటికీ ఈ మధ్య పలు ఇంటర్వ్యూల్లో రష్మిక పరోక్షంగా స్పందించారు. 'నా ఎంగేజ్‌మెంట్ విషయంలో మీరు ఏం అనుకుంటున్నారో అదే నిజం. సమయం వచ్చినప్పుడు వెల్లడిస్తా' అని అన్నారు. ఇప్పుడు విజయ్‌తో పెళ్లి విషయంలో స్పష్టమైన సమాధానమిచ్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీరి పెళ్లి జరగనున్నట్లు టాక్ వినిపిస్తోంది.



వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, నవంబర్ 08, 2025



# పద్మశాలి వన భోజనాలకు సర్వం సిద్ధం

- ముమ్మరంగా ఏర్పాట్లు
- తరలిరానున్న కులబాంధవులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని ఎర్రగట్టుగుట్ట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించనున్న పద్మశాలి కుల బంధువుల కార్తీక మాస సామూహిక వనభోజన మహోత్సవానికి సర్వం సిద్ధం అయింది. పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, వన భోజన నిర్వహణ కమిటీ కన్వీనర్ గడ్డం భాస్కర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వన భోజనాలు జరిగే ప్రాంతాన్ని జేసీబీలతో చదును చేయించారు. పెద్ద ఎత్తున తరలి వచ్చే పద్మశాలీలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. హనుమకొండ జిల్లా పరిధిలోని పద్మశాలి కుల బాంధవులు కార్తీక మాస వనభోజనం మహోత్సవానికి పెద్ద ఎత్తున తరలివచ్చి ఆహ్లాద వాతావరణంలో రోజంతా గడపాలంటూ నిర్వాహకులు పిలుపునిచ్చారు. స్నేహబంధం, కుల ఐక్యత, సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు తెలిపేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. ఉదయం 8.30 గంటలనుంచి సాయంత్రం 6.30 గంటలకు వరకు వివిధ కార్యక్రమాలతో ఈ ప్రాంతం హోరెత్తనుంది. ఉదయం మార్కండేయ దేవునికి పూజతో కార్యక్రమం ప్రారంభం కానుంది. అనంతరం ఆట పాట, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకోనున్నాయి. 10 గంటలకు ఎర్రగట్టుగుట్ట నుంచి ఎర్రగట్టుగుట్ట సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆటపాటల్లో విజేతలకు బహుమతులతో పాటు సన్మానం చేయడం ద్వారా వారిలో మరింత ఉత్సాహాన్ని నింపేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం సామూహిక వనభోజనాలు ఏర్పాటు చేశారు.

సాయంత్రం ఆరు గంటలకు దీపారాధన కార్యక్రమంతో వనభోజన కార్యక్రమం ముగియనుంది. పద్మశాలి కులస్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ నిర్వాహకులు పిలుపునిచ్చారు. గత రెండు, మూడు రోజులుగా అక్కడే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.





# ప్రసాద్ కు సెషన్స్ జడ్జిగా పదోన్నతి



## □ అభినందించిన స్థానికులు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలోని రంగశాయిపేట ప్రాంతానికి చెందిన డాక్టర్ కంచ ప్రసాద్ కు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా పదోన్నతి కల్పించి ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు కం 13వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా హైదరాబాద్ లో నియామకం చేశారు. రంగశాయిపేటలో హైస్కూల్, ఇంటర్ విద్యను పూర్తిచేసుకున్న కంచ ప్రసాద్ వరంగల్ లో డిగ్రీతోపాటు కాకతీయ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్ బీ, గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం విద్యను పూర్తి చేశారు. 2010 వ సంవత్సరంలో హుస్నాబాద్ లో జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులు కావడంతోపాటు హుజురాబాద్, బెల్లంపల్లిలో ఉద్యోగ బాధ్యతలను నిర్వహించారు. 2019 లో సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది ఆదిలాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగా, కరీంనగర్, జగిత్యాల జిల్లాలతో పాటు, ప్రస్తుతం పదో అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ గా సికింద్రాబాద్ లో విధులను నిర్వహించారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలోనే పదోన్నతి లభించింది. కంచ ప్రసాద్ న్యాయశాస్త్ర విభాగంలో జువైనల్ జస్టిస్ సిస్టం ఇన్ ఇండియా ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టు ఫంక్షనింగ్ చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశం మీద రీసెర్చ్ చేసి థీసిస్ సమర్పించినందుకు గాను ఇటీవల కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అవార్డును రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా అందుకున్నారు. డాక్టర్ కంచ ప్రసాద్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా పదోన్నతి పొంది మంగళవారం హైదరాబాదు ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు కం 13వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా బాధ్యతలు స్వీకరిస్తున్నందున 42 వడివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ వారికి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. మా ప్రాంత వాస్తవ్యుడు కావడం చాలా సంతోషకరమని ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ కంచ ప్రసాద్ కు వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎలుకుర్తి ఆనంద్ మోహన్, 44వ డివిజన్ కార్పొరేటర్ జలగం అనిత రంజిత్, రంగసాయిపేటలోని కాకతీయ సేవా సమితి అధ్యక్షులు మండల నరసింహరాములు, ప్రగతి పరపతి సంఘం అధ్యక్షులు కంచ సాంబయ్య, మిత్ర పరపతి సంఘం అధ్యక్షులు చిగిరి కుమార్ లతో పాటు మిత్రులు బుక్క సతీష్ కుమార్, దామెరకొండ కరుణాకర్, డాక్టర్ కోట శ్రీధర్ కుమార్, బీవీ రామకృష్ణ ప్రసాద్, శివారపు సురేష్ బాబు, దేవులపల్లి కమలాకర్, మండల హేమంత్, చందా దామోదర్, బక్కి శ్యామ్, శంకేసి గణేష్, శంకేసి సుధాకర్, కొక్కొండ భాస్కర్, మాడుగుల రాజ్ కుమార్, పాలడుగుల హరికుమార్, బక్కి రాజేందర్, కంచ రమేష్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# అర్హులకు ప్రభుత్వ పథకాలు

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- అధికారులకు దిశా నిర్దేశం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన మహిళలు, పిల్లలకు చేరేలా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్లో శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి మహిళా శిశు సంక్షేమ శాఖ ఇంజనీరింగ్, డీఆర్ డీఓ, క్రీడల, సంక్షేమ శాఖలు, ఇతర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మహిళా, శిశు, దివ్యాంగులు, వయవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాలు, గర్భిణులకు బాలింతలకు అందుతున్న సేవలు, మిషన్ వాత్సల్య, శిశు సంరక్షణ కేంద్రాలు, బాల్యవివాహాల నిర్మూలన, పోషన్ అభియాన్, బేటి బచావో బేటి పడావో, చైల్డ్ హెల్ప్ లైన్, అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవసేవలు వంటి కార్యక్రమాలు అమలును కలెక్టర్ సమీక్షించి సమర్ధ నిర్వహణకు పలు సూచనలు చేశారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడి కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణాలపై దృష్టి సారించాలని, మొదటి ప్రాధాన్యత తీసుకున్న భవన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమం కింద 2025 –26 కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలలో గీజర్లు ఏర్పాటు చేయాలన్నారు. మహిళ, శిశు సంక్షేమ, యువజన క్రీడల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మూడు నెలలపాటు కబడ్డీ ఖోఖో, వాలీబాల్ క్రీడలను 20 పాఠశాలల్లో నిర్వహించాలని, వాటి నిర్వహణకు అవసరమగు క్రీడా సామాగ్రి ఏర్పాటు చేయాలన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా వంద మంది కేజీబీవీ విద్యార్థులను నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ కు తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. బాల, బాలికల లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న 100 గ్రామాల్లో నిష్పత్తి సూచించే బోర్డులను గ్రామపంచాయతీలలో ప్రదర్శించుటకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అడ్వెంచర్ ఆక్టివిటీస్ లో భాగంగా ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులను పాకాల, బటర్ ఫ్లై పార్కు తీసుకెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో కనీస వసతులైన తాగునీరు, టాయిలెట్ డిసెంబర్ 15 నాటికి అందుబాటులోకి తీసుకోరావాలని సంబంధించిన ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నశా ముక్త్ భారత అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్, వైద్య ఆరోగ్య, సంబంధిత శాఖల అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమంలో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ, ఇంఛార్జి డీఆర్డీఓ రామిరెడ్డి, జీడబ్ల్యూఓ రాజమణి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ఇజ్జగిరి, జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు పుష్పలత, జిల్లా క్రీడల అధికారి అనిల్ భాగ్యలక్ష్మి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సౌజన్య సీడీపీఓలు మధురిమ, విద్య, సఖి, చైల్డ్ హెల్ప్ లైన్, పోషన్ అభియాన్, డీహెచ్ఈడబ్లూ సమన్వయకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రంలో హల్ చల్..

రైతులు పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. పర్వతగిరి మండలం మాల్యా తండా, ఏనుగల్లు, చౌటపల్లి గ్రామాల్లో ఐ కె పి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా రైతులు కొనుగోలు కేంద్రంలో పోసుకున్న ధ్యానం కుప్పలను పరిశీలించి, ధాన్యం ఎప్పుడు తీసుకువచ్చారు? స్థానికంగా కల్పించిన వసతులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తేమ శాతాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. భారీ వర్షాలకు నష్టపోయిన పంట వివరాలు ఆదివారంలోగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ రైతులను కోరారు. వ్యవసాయ అధికారులు పంట నష్టపోయిన ఏ ఒక్క రైతు వదలకుండా అర్హులైన రైతులందరి నష్ట వివరాలు రేపు సాయంత్రం లోగా నమోదు చేసి నివేదిక సమర్పించాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ, ఇంచార్జి డీఆర్డీఓ రామిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఐకేపీ సిబ్బంది, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com